క్లుప్తంగా

గాజులపాలెం పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు

అద్దంకిరూరల్: అద్దంకి పట్టణంలోని గాజులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ ఎన్‌క్యూఏఎస్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) గుర్తింపు లభించిందని వైద్యాధికారి గొట్టిపాటి జయసింహ బుధవారంహో ప్రకటనలో తెలిపారు. సిబ్బంది కృషితోనే గుర్తింపు సాధ్యమైందని పేర్కొంటూ ప్రత్యేకంగా అభినందించారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభం



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

చినగంజాం: ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపాలెం, రాజుబంగారు పాలెం గ్రామాల్లో బుధవారం అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తపాలెం పంచాయతీలోని రామచంద్రనగర్ గ్రామంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి రోడ్డుకు రూ.10 లక్షలు మంజూరు కాగా నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, టీడీపీ నాయకులు ఆజాద్ పాల్గొన్నారు.

అధిక లోడు వాహనాలపై చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ అంకమ్మరావు

పర్చూరు (చినగంజాం): అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకుంటామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు హెచ్చరించారు. బుధవారం పర్చూరులో ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలకు ఆయన జరిమానా విధించారు.

ఇంకొల్లులో నేత్రదానం



నేత్రాదానం చేసిన సరోజని (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇంకొల్లులో బుధవారం మృతి చెందిన కందిమళ్ల సరోజని(82) నేత్రాలను ఆమె బంధువులు దానం చేశారు. ఆమె కుటుంబ సభ్యులు అవయవ దాన కమిటీ అడిగిన వెంటనే కార్నియాలను ఇచ్చేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో వారి కుమార్తెలు అనంతలక్ష్మి, విజయలక్ష్మి, అల్లుడు వెంకటేశ్వర్లు, శంకర కంటి వైద్యశాల వైద్యులు, అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ రఫీ, కార్యదర్శి చుండి సాంబశివరావు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

చీరాల అర్బన్: బాపట్ల జిల్లా కాపు నాడు అధ్యక్షుడిగా లక్కాకుల నాగేశ్వరరావు, రాష్ట్ర న్యాయవాదుల విభాగం కార్యదర్శిగా కనపర్తి రామారావులకు నియామకపత్రాలను రాష్ట్ర కాపునాడు సేవా సమితి అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు అందించారు. బుధవారం చీరాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు, కార్యదర్శి తోట శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికై న వారికి నియామక పత్రాలు అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కాపులు కష్టకాలంలో ఉన్న సమయంలో వారికి సహాయ సహకారాలు అందిస్తూ, కాపు భవన నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలుదాసు రామకృష్ణ, మిరియాల శ్రీనివాసరావు, గొట్టిముక్కల నాగేశ్వరరావు, మామిడాల శ్రీనివాసరావు, అకిశెట్టి పుల్లయ్య నాయుడు, మహిళా అధ్యక్షురాలు రెడ్డి లత, లక్ష్మి, కాపు సంఘీయులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ

మార్టూరు: మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం సాయంత్రం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని, వీధులను శుభ్రపరిచారు.

ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేసుకోవాలి



నూతలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మేరిమ్మ



అనమనమూరులో మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్



ఉప్పుమాగులూరులో మాట్లాడుతున్న ఏవో కుమారి

పర్చూరు (చినగంజాం): రైతులు తమ పంటల పూర్తి వివరాలను ఈ-క్రాప్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని పర్చూరు వ్యవసాయాధికారి ఎస్.మేరిమ్మ తెలిపారు. బుధవారం నూతలపాడులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్టపరిహారం అందుతుందని వివరించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా రైతులకు సంవత్సరానికి రూ.20 వేల నగదును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. పంట సాగుకు ముందు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను భూమిలో వేసుకొని పూత దశలో వాటిని కలియదున్నాలని తెలిపారు. వ్యవసాయ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా అధిగమించాలో ఆమె రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి రవి ప్రకాష్, మార్కెట్ యార్డు సహాయకులు లంకా లక్ష్మణ్, యానిమల్ హస్బెండరీ సహాయకులు రాజ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకుడు సీహెచ్ మధుమోహన్, సహాయకురాలు షేక్ నసీమా, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మార్టూరు: ప్రస్తుత వాతావరణంలో పత్తి పంటపై గులాబీ రంగు పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున సంబంధిత రైతులు జాగ్రత్తలు తీసుకుని దిగుబడులు తగ్గకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.కిరణ్కుమార్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. గులాబీ రంగు పురుగును గుడ్ల దశలోనే నిర్మూలించడం కోసం ఎకరాకు 1500 పిపిఎం వేప నూనెను 500 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని తెలిపారు. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఏవో తెలిపారు. రెక్కల పురుగు ఉధృతిని నివారించేందుకు లీటరు నీటికి 2.5 మిల్లీలీటర్ల క్లోరో ఫైరీఫాస్ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్లో పంటల నమోదుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున సంబంధిత రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి క్రాంతికిరణ్, బబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, రాజుగారిపాలెం సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతరాజు పాల్గొన్నారు.

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి కుమారి మాట్లాడుతూ.. వ్యవసాయ పథకాలు, ఈ పంట నమోదు, పత్తిలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతి, వీఏఏలు హనుమునాయక్, హరి గ్రామ నాయకులు నరేంద్ర, వినోద్, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

మేదరమెట్ల: రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదుతోపాటు ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ ధనరాజ్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం తమ్మవరం, అనమనమూరు గ్రామాల్లో రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులు, డ్రోన్లతో కలిగే ప్రయోజనాలను ఏవో శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జంపు హరిబాబు, వీరాంజనేయులు, వ్యవసాయ అనుబంధ శాఖల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు పంగులూరు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పంగులూరు విద్యార్థులు ఎంపికైనట్లు బల్లికురవ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. రమాదేవి తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన ఆళ్లశ్రీను, పేరం వెంకటేశ్వర్లు, వల్లి సాగర్ ఎంపికయ్యారని పేర్కొంటూ, ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీఎంగా మాణిక్యరావు



బాధ్యతలు చేపట్టిన మాణిక్యారావు

మేదరమెట్ల: కొరిశపాడు మండల డీఆర్‌డీఏ ఏపీఎంగా ఎస్.మాణిక్యరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లా పొదిలి మండలం నుంచి బదిలీపై కొరిశపాడులో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సైన్సుపై అభిరుచి పెంచేందుకే చెకుముకి



చెకుముకి టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

ఇంకొల్లు (చినగంజాం): విద్యార్థుల్లో సైన్సుపై అభిరుచిని పెంచేందుకే జన విజ్ఞాన వేదిక సైన్సు సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఇంకొల్లు మండల జేవీవీ కన్వీనర్ చెంచయ్య అన్నారు. బుధవారం ఇంకొల్లులో విద్యాశాఖ అనుమతితో జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ సంయుక్తంగా చెకుముకి సైన్సు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచయ్య మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎంలు, సైన్సు ఉపాధ్యాయుల సహకారంతో మొత్తం 300 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతి హైస్కూల్ నుంచి 8,9,10 తరగతుల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు పాఠశాల టీమ్‌గా అక్టోబరు 1వ తేదీ మండల స్థాయి పరీక్షకు హాజరవుతారని తెలిపారు. యూటీఎఫ్ ఇంకొల్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సమత, ఎస్‌కే మస్తాన్ వలి పాల్గొన్నారు.

చినగంజాం: ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్సు సంబరాలు 2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ప్రతి ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో హెచ్‌ఎం డి.రత్నకుమారి, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి, హెచ్‌ఎం కుర్రా రామారావు పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పేపర్‌లు ఆవిష్కరించారు. మండలంలోని మిగిలిన పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆవిష్కరించారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను పాఠశాల స్థాయిలో నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనే లక్ష్యంగా పనిచేద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

మేదరమెట్ల: సమాజంలో ఎయిడ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ పేర్కొన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ మండలి, హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామ సచివాలయం వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, బీవీసాగర్, ఈవో లక్ష్మీకాంత్, సర్దార్, రాధ, కృష్ణవేణి, డి.భార్గవ్, నయోమీ, సువార్త తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో దివ్యాంగులకు స్వస్థత



చిన్నారులతో వ్యాయాయం చేయిస్తున్న ఫిజియోథెరపిస్ట్

బల్లికురవ: వైకల్యం కలిగిన 14 ఏళ్లలోపు చిన్నారులకు రోజూ ఫిజియోథెరపీ చేస్తే స్వస్థత పొందే అవకాశం ఉందని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని పేర్కొన్నారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రంలో పది మంది చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. దివ్యాంగులను సాధారణ పిల్లలతో సమానంగా పెంచుతూ మంచి పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఈఆర్టీలు నాగబాబు, నాగిని పాల్గొన్నారు.

క్లుప్తంగా..

యాజమాన్య పద్ధతులతో ఉత్తమ దిగుబడి



వరినారు మడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చీరాల రూరల్: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. బుధవారం గాంధీనగర్, రామకృష్ణాపురంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు రైతులతో కలిసి పంట పొలాల్లోకి వెళ్లి క్షేత్ర పరిశీలన చేశారు. వరినారుమడుల్లో జింక్ లోప నివారణకు గాను జడ్ఎస్ఓ4-2 లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ ఉషా మాట్లాడుతూ పారుడు రోగ నివారణకు టీకాలు వేయించాలని సూచించారు. రవికుమార్, రమ్య, బస్తెబా, రైతులు పాల్గొన్నారు.

చేగువీర సిద్ధాంతం ఎటు పోయింది పవన్?

చీరాల: చేగువీరాని ఆదర్శంగా తీసుకుని యువతకు అండగా ఉంటానంటూ జనంలోకి వచ్చిన పవన్ కళ్యాణ్ నేడు కొత్త అవతారం ఎత్తి సనాతన ధర్మం జోలికి వస్తే ఊరుకోను అంటున్న సంకేతం దేనికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు యాతం మధుకర్ బుధవారం విమర్శించారు. నిరాధార మాటలతో ఆయన ఆరోపణలు చేస్తున్నారన్నారు. సహచర మంత్రి నారా లోకేష్ తన ట్విట్టర్ ఖాతాలో నాలుగు కంటైనర్లలోని నెయ్యిని తిరిగి పంపించివేశామని తెలిపారన్నారు. కులం, మతం లేని సమాజాన్ని నియమించడమే తమ పార్టీ సిద్ధాంతమని తెలిపిన వ్యక్తులు మీరు కాదా అని ప్రశ్నించారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు చిన్నారి సాయం

- దాచుకున్న రూ.13,658 అందించిన బాలిక

చీరాల అర్బన్: చిన్న చేతులు పెద్ద సాయం అన్న రీతిలో ఓ చిన్నారి తన వద్ద దాచుకున్న రూ.13,658 నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించి దాతృత్వాన్ని చాటింది. చీరాలకు చెందిన చవిడిబోయిన వెంకట నాగలక్ష్మి శరణ్య కొత్తపేటలోని బీఆర్‌కె స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతున్న బాలిక బుధవారం సాయం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచింది.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై పోలీసులు బుధవారం రాత్రి దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. నాగండ్ల గ్రామ శివారులో కోడి పందెం ఆడుతున్న స్థావరంపై దాడిలో 11 మందిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,290 నగదు, 3 పందెం కోళ్లు, 6 మోటార్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రఘురామకృష్ణ, నానాజీపై చర్యలు తీసుకోవాలి

అద్దంకి రూరల్: అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి అవమానపరిచిన ఎమ్మెల్యేలు రఘురామకృష్ణరాజు, దళిత డాక్టర్‌పై దాడికి పాల్పడిన నానాజీపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కంకణాల శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అంకమ్మరావు డిమాండ్ చేశారు. ఫ్లెక్సీ బ్యానర్ చించి కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు. దళితులను అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఇసుక టైరు బండ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఏడు టైరు బండ్లు

చీరాల టౌన్: మండలంలోని పాతచీరాల శివారు ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా జోరుగా జరుగుతోంది. ఇసుక దిబ్బలను హరించి అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ఎట్టకేలకు బుధవారం రెవెన్యూ అధికారులు మొక్కుబడి దాడులు చేశారు. ఏడు టైరు బండ్లు స్వాధీనం చేసుకుని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పాత చీరాల గ్రామ పంచాయతీలో క్వారీలపై దాడులు చేయగా గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు తమ టైరు బండ్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో ఎద్దులతో సహా పట్టుకున్నారు. అయితే టైరు బండ్లను మాత్రం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇసుక తవ్వుతున్నా, అమ్మకాలు చేస్తున్నా 8712655933 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. మండల ఆర్ఐ సీహెచ్. శేఖర్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యం పూర్తి చేయాలి

బల్లికురవ: మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా బుధవారం బల్లికురవ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గృహ నిర్మాణం లక్ష్యాల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. 2025 మార్చి నాటికి గృహాలు నిర్మించుకోకుంటే పట్టాలు రద్దు చేస్తామని ఎంపీడీఓ స్పష్టం చేశారు.

తీర ప్రాంతంలో ఎన్‌సీసీ సేవ



తీర ప్రాంతంలో సెయింట్ ఆన్స్ స్కూలు ఎన్‌సీసీ క్యాడెట్లు

చీరాల రూరల్: సముద్ర తీర ప్రాంతంలో సెయింట్ ఆన్స్ స్కూలుకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం పాలుపంచుకున్నారు. ఇటీవల వినాయక చవితి పండగ అనంతరం గణనాథుల ప్రతిమలను చీరాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సముద్రంలో నిమజ్జనం చేశారు. దీంతో ఆయా సముద్రతీరాల్లో అపరిశుభ్రంగా మారింది. దీంతో చీరాల ప్రాంతంలోని అన్ని స్కూళ్లకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు స్వచ్ఛతకు నడుం బిగించారు.

కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపీనాథ్, ఎన్‌సీసీ అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లేక పస్తులు



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న తాపీ వర్కర్లు

చీరాల: నియోజకవర్గంలో ఇసుక కొరత కారణంగా బేల్దారీ కూలీలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని.. ది చీరాల తాలూకా తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాపారావు కోరారు. బుధవారం చీరాల తహసీల్దార్ గోపీ కృష్ణను కలిసి బేల్దార్లు ఇసుక కొరత కారణంగా పడుతున్న ఇబ్బందులపై తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. చీరాల్లో కృత్రిమ ఇసుక కొరత ఏర్పడిందని.. ఫలితంగా బేల్దారులు, ఇతర భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక పస్తులుంటున్నారని వాపోయారు. రామకృష్ణ, శ్రీనివాస్, సాంబయ్య, బేల్దార్లు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై పనిచేయాలి

- ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

జె.పంగులూరు: ప్రజలతో అధికారులు మమేకమై పనిచేయాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం ముప్పవరం గ్రామ సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

లోపలకు వెళ్తే అంతే!

- శిథిలావస్థలో జలవనరుల శాఖ కార్యాలయం
- గాయాలపాలవుతున్న సిబ్బంది
- లోపలకు వెళ్లకుండా బయటే పడిగాపులు

చీరాల: అది జలవనరులశాఖ కార్యాలయం. నాలుగు నియోజకవర్గాలకు చెందిన రైతులకు సాగు నీరు అందించే సిబ్బంది కొలువుదీరే చోటు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించే కొమ్మమూరు కాలువ పనులన్నీ ఈ కార్యాలయం నుంచే నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కాలువల పరిస్థితి ఎలా ఉందో....కార్యాలయాల పరిస్థితి కూడా అలానే ఉంది. పట్టణంలోని పాలిమేర రోడ్డులో ఉండే ఇరిగేషన్ కార్యాలయం ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొంది. శ్లాబు పెచ్చులూడి పోయి సిబ్బంది తరచూ గాయాలపాలవుతున్నారు. కంప్యూటర్, ఇతర పరికరాలు దెబ్బతింటున్నాయి. సిబ్బంది ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారం లేకపోవడంతో ఉద్యోగులు కార్యాలయంలోకి అడుగుపెట్టడానికి భయపడుతున్నారు.



పాలిమేర రోడ్డులోని జలవనరుల కార్యాలయం



ఇనుప చువ్వలు బయటపడిన అధికారి గది



ప్రమాదభరితంగా ఉన్న శ్లాబు



శ్లాబు పెచ్చులు పడి ధ్వంసమైన కంప్యూటర్ పరికరం